క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(వియవాడసెంట్రల్): అలంకార్ సబ్ స్టేషన్ 11 కేవీ జింఖానా ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాల నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, సీతన్నపేట, బాపిస్ట్ పాలెం, పెజ్జోనిపేట్, హార్ట్ పెట్, పప్పుల మిల్ రోడ్డు, పాల బజారు, ఫిల్మ్ గోడౌన్ స్ట్రీట్, పీటర్ స్ట్రీట్, నాడార్ స్ట్రీట్. వంగ సుందరావు, ఆర్ సి ఎం చర్చ ఏరియా, అల్లావుద్దీన్ స్ట్రీట్, డేవిడ్ స్ట్రీట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పిల్లల విభాగంలో సీ-పాప్, ఫొటో థెరపీ యూనిట్లు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రి పిల్లల విభాగంలోని నవజాత శిశువులకు వైద్యం అందించడంలో దోహదపడే సీ–పాప్‌లు, ఫొటో థెరపీ యూనిట్‌లను బుధవారం సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. వాటితో పాటు నియోకూలెంట్ పరికరాలను సమకూర్చారు. ఇవి నవజాత శిశువులకు వైద్యం అందించడంలో ఎంతో ఉపయోగపడతాయని పిడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పి.అనిల్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

సప్తస్వర సమ్మేళనం గాత్ర యుగళం



విజయవాడ కల్చరల్: హంసధ్వని చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పడమట దత్తపీఠంలోని మరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న సంగీత సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో విష్ణుభొట్ల కృష్ణవేణీ, విష్ణుభొట్ల సోదరీమణులు నిర్వహించిన గాత్రయుగళం అలరించింది. త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలు మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, మృదంగంపై బీవీఎస్ ప్రకాష్, ఘటంపై కానూరి వెంకటరామకృష్ణ సహకరించారు. హంసధ్వని చారిటబుల్ సంస్థ నిర్వాహకుడు యనమండ్ర శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ గురువారంతో సంగీత ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. మారెళ్ళ కీర్తిచంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో హంసధ్వని చారిటబుల్ సంస్థ సభ్యులు రామశాస్త్రి, గోపీకృష్ణ శర్మ, రామకృష్ణ పాల్గొన్నారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో త్యాగరాజ స్వామికి పూజలు నిర్వహించారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని విద్యాధరపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన గంధవరపు జ్యోతికి 13 ఏళ్ల క్రితం అశోక్ అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నెల 16న జ్యోతి తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి భర్త వద్ద రూ. 600 తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. జ్యోతి తల్లి ఫోన్ చేయగా ఫోన్ స్విచాఫ్ వచ్చింది. 17వ తేదీ ఫోన్ చేయగా అప్పుల వాళ్లు ఫోన్లు చేస్తున్నారని, అందుకే స్విచాఫ్ చేశానని తల్లితో చెప్పింది. ఇక ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ అయింది. అప్పటి నుంచి జ్యోతి ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తల్లి నాగరాజు చంటి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముస్తాబాదలో చెస్ పోటీలు



గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ బసవేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో చదరంగం ఆటను అభివృద్ధి చేయటంలో అకాడమీ వ్యవస్థాపకుడు బొబ్బా రత్నారావు ఎనలేని కృషి చేశారన్నారు. ఇటీవల ఆయన మృతి చెందడంతో అదే స్ఫూర్తిని అతని కుమారుడు చెస్ అంతర్జాతీయ కోచ్, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి వీఆర్ బొబ్బా కొనసాగించటం అభినందనీయమన్నారు. 92 మంది పోటీలకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

బీమా కోసం ఎదురుచూపులు

- ఐదు నెలలు గడుస్తున్నా బాధితులకు అందని వైనం
- ఆందోళనలో ద్విచక్రవాహనదారులు
- ప్రభుత్వం స్పందించాలని వినతి



కండ్రికలో రిపేరు కోసం ద్విచక్రవాహనాలు

పాయకాపురం(విజయవాడరూరల్): బుడమేరు వరదల్లో ముంపునకు గురైన ద్విచక్రవాహనదారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన బీమా కోసం ఎదురుచూస్తున్నారు. వరదలు సంభవించి ఐదు నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క రూపాయి ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముంపునకు గురైన ద్విచక్రవాహనాలకు బీమా కింద ఆర్థిక సహాయం చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని బాధితులు వాపోతున్నారు. సెప్టెంబరు నెలలో సంభవించిన బుడమేరు వరదలకు కండ్రిక, పాయకాపురం, రాజీవ్‌నగర్, రాధానగర్, బర్మాకాలనీ, ప్రజాశక్తి నగర్, ఎల్‌బీఎస్ నగర్, ఉడా కాలనీ పరిసర ప్రాంతాల్లోని వేలాది ద్విచక్రవాహనాలు బుడమేరు ముంపులో చిక్కుకొని పూర్తిగా పాడైపోయాయి. ఇళ్లన్నీ మునిగిపోయి తిండీ తిప్పలు లేక నానా అవస్థలు పడ్డారు. బుడమేరు బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా ఆహార పొట్లాలను అందచేసి చేతులు దులుపుకుందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. పనులేక పస్తులుంటున్న సందర్భాల్లో చిన్న చిన్న పనులు చేసుకొందామంటే ద్విచక్రవాహనాలు పాడైపోయి ఉండటంతో ఎక్కడకూ వెళ్లలేనిస్థితి నెలకొంది. ద్విచక్రవాహనాలు తడిసిపోయిన బాధితులు వరద ప్రాంతాలను పరిశీలించడానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు ద్విచక్రవాహనాలు రిపేరు చేయించాలని అడిగారు. వరదల్లో చిక్కుకొని పాడైన ద్విచక్రవాహనాల రిపేరు కోసం మూడు వేల రూపాయల చొప్పున అందచేస్తామని ప్రకటించారు. సీఎం ప్రకటించిందే తరువాయి వాహనదారులు తడిసిపోయిన ద్విచక్రవాహనాలను నెట్టుకొంటూ దగ్గర్లోని మెకానిక్ షెడ్డులకు తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం రాగానే డబ్బులు చెల్లిస్తామని రిపేర్లు చేయాలని నెలలు తరబడి తమ ద్విచక్రవాహనాలను షెడ్డుల వద్దే ఉంచారు.

ముంపులో 18 వేల వాహనాలు....

దాదాపు 18 వేల ద్విచక్రవాహనాలు బుడమేరు వరదల్లో ముంపునకు గురైనట్లు ప్రాథమిక అంచనా. అయితే వాటిలో 6,800 మందికి మాత్రమే ప్రభుత్వం నుంచి బీమా సదుపాయం కింద మూడు వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందింది. మిగిలిన 11,200 మంది బాధితులకు ప్రభుత్వ ప్రకటించిన సహాయం అందలేదు. ప్రభుత్వ సహాయం కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ, సబ్‌కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని బాధితులు అంటున్నారు. బీమా కాగితాలు సక్రమంగా లేని కారణంగా కొంత మందికి సహాయం రాలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వరదల్లో తడిసిన యాక్టివా బండ్లకు, స్కూటీలకు ఇంజిన్ ఆయిల్, గేర్ ఆయిల్, పొల్యూషన్ ఫిల్టర్, ఎయిర్‌ఫిల్టర్, ప్లగ్, ప్లగ్‌క్యాప్ మాత్రమే రిపేరు చేయడానికి మూడు వేల రూపాయలు చాలటంలేదని మెకానిక్‌లు అంటున్నారు. హీరోహోండా, బజాజ్ బైక్‌లకు అయితే వైరింగ్ తడిసి పాడైపోయిన కాయిల్స్ వస్తే మార్చాల్సి ఉంటే మూడు వేల రూపాయలు, కార్బెటర్ క్లీన్ చేయాలి ఎయిర్‌ఫిల్టర్ క్లీన్, వీల్‌బేరింగ్లు, క్లచ్‌పేట్లు ఇవన్నీ 8వేల నుంచి 10వేల రూపాయిలు ఖర్చు అవుతుంది. మెకానిక్ సర్వీసు చార్జి సుమారు రెండు వేల రూపాయలు అవుతుందంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామ మాత్రపు ఆర్థిక సహాయం కూడా అందకపోవడంతో నేటికీ షెడ్డులవద్ద రిపేర్లు చేయించే కోలేని వారు తమ వాహనాలను అక్కడే ఉంచుతున్నారు. ఏ పనికి వెళ్లాలన్నా ఈ రోజుల్లో బైక్ అవసరం అవుతుందని, ఆటోల్లో వెళ్లాలంటే టైమ్‌కు వెళ్లలేక, వచ్చిన డబ్బులు చాలక నానా యాతన పడుతున్నామని బాధితులు వాపోతున్నారు.



రిపేర్ల కోసం విద్యుత్ వెహికల్స్

మూడు వేలు రాలేదు



ముంపులో మునిగిపోయిన మా ఇంటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు. తాను మెకానిక్ పని చేస్తుంటాను. నా ద్విచక్రవాహనం సైతం ముంపులో పాడైపోయింది. ప్రభుత్వం బీమా క్రింద చెల్లించే మూడు వేల రూపాయలు నాకు రాలేదు. దెబ్బతిన్న బండికి ప్రభుత్వం ఇస్తానన్న మూడు వేలు ఏ మూలకూ చాలవు.

– ఫణి, మెకానిక్, కండ్రిక

ఎప్పటికి ఇస్తారో ?



ప్రభుత్వం నుంచి బీమా సదుపాయం అందుతుందని నెలలు తరబడి ఎదురు చూస్తున్నాను. తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. ఇంత వరకు జాబితా రాలేదని చెబుతున్నారు. ఎప్పటికి ఇస్తారో అర్థం కావడం లేదు. వేలాది రూపాయలు ఖరీదయ్యే ద్విచక్రవాహనాలు దెబ్బతిని నానా బాధలు పడుతున్నాం. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

– నూరుబాషా, కండ్రిక

తాగునీటి సమస్య నివారణపై ప్రత్యేక దృష్టి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నగర శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్యలపై కార్పొరేషన్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 57, 58 డివిజన్‌లలోని న్యూరాజరాజేశ్వరీపేట, ఇందిరా నాయక్‌నగర్, నందమూరినగర్ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలపై అధికారులు బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి పాల్గొని ఈ రెండు డివిజన్‌లలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు తెలిపారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. వైఎస్సార్సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఇసరపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెదపులిపాకలో వక్ఫ్ భూముల సర్వే


పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉన్న వక్ఫ్ భూములను బుధవారం సర్వే చేశారు. గ్రామంలో ఆర్‌ఎస్ నంబర్ 87లో 12.59 ఎకరాలు, ఆర్‌ఎస్ నంబర్ 93లో 9.63 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. అధికారులు సర్వే చేసిన అనంతరం పొలం హద్దులు ఏర్పాటు చేశారు. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఎండీ నూహుఆలీషా, వీఆర్వో జీవా, విలేజ్ సర్వేయర్ శ్రీనివాస్, ఖాజీ ఎండీ హబీబుల్లాహసన్, వక్ఫ్ సర్వేయర్ షేక్.ఆశిక్, సిబ్బంది ఎండీ కరీముల్లా పాల్గొన్నారు.

చిత్ర పరిశ్రమకు అక్కినేని సేవలు చిరస్మరణీయం



అక్కినేని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు, అభిమానులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలు అందించిన అక్కినేని నాగేశ్వరరావు చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. అత్యుత్తమ నటుడు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు 11వ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్స్‌రే సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో గల అక్కినేని విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. సొసైటీ అధ్యక్షుడు బి.వసంత కుమార్ మాట్లాడుతూ 90 ఏళ్ల జీవిత కాలంలో 75 సంవత్సరాల పాటు సినిమాలలో నటించిన అక్కినేని నాగేశ్వరరావు వంటి వ్యక్తి దేశంలో మరొకరు లేరని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమను మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తీసుకురావడంలో అక్కినేని కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అక్కినేని వ్యక్తిగతంగా నాస్తికుడు అయినప్పటికీ ఎన్నో భక్తిరస సినిమాలలో అద్భుతంగా నటించి రక్తి కట్టించారన్నారు. అక్కినేని విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన శిల్ప కళారత్న దేవికారాణి శిల్ప కళా నైపుణ్యం ప్రశంసనీయమన్నారు. ఎక్స్‌రే అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ అక్కినేనితో తనకున్న పరిచయాన్ని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి గుర్రం ఏడుకొండలు, అక్కినేని అభిమానులు డాక్టర్ నాగమల్లిక, బోడి ఆంజనేయరాజు, స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇ.కృష్ణ ప్రసాద్, ప్రభల శ్రీనివాస్, ఎంవీ కృష్ణారావు, పీవీఎల్ఎస్ రాజు, ఎస్‌కే షఫీఉల్లా, ఆలిండియా అక్కినేని అభిమాన సంఘం అధ్యక్షుడు ఎస్.సర్వేశ్వరరావు, చింతకాయల చిట్టిబాబు తదితరులు పాల్గొని అక్కినేనికి నివాళులు అర్పించారు.



ఇదేదో చిత్రకళా పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన చిత్రం అనుకుంటున్నారు కదూ... ప్రకృతి కాన్వాసుపై సూర్యభగవానుడు చిత్రించిన సహజ సౌందర్య చిత్ర రాజం... సాయం సంధ్య వేళ అరుణ కిరణాలతో ఆకాశంతో పాటు కృష్ణవేణీ నదీ జలాలు కూడా అరుణవర్ణంతో మెరిసిపోతుంటే...తమ జీవన భృతి కోసం ఉదయమే వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరుగుముఖం పట్టిన దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో అందంగా బంధించింది. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేడు ఎస్ఆర్ఆర్‌లో జాతీయ ఓటరు దినోత్సవ పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు గురువారం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని చెప్పారు. పోటీలు గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ (9487916504) నంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కొత్తూరు తాడేపల్లిలోని సెంచరీ ప్లై బోర్డ్స్ గోడౌన్ ఇన్‌చార్జి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గొల్లపూడి పంట కాలువ రోడ్డులోని హిమజ రెసిడెన్సీలో నివాసం ఉంటున్న మహమ్మద్ ముస్తఫా సెంచరీ ప్లైబోర్డ్స్ గోడౌన్‌లో సీనియర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 10న భార్య పిల్లలను హైదరాబాద్‌లోని పుట్టింటికి పంపించేశాడు. ఈ నెల 17న భార్య ఫోన్ చేసి మాట్లాడగా మీటింగ్‌లో ఉన్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఆదివారం మరోసారి వీడియో కాల్ చేస్తే ఇంట్లోనే ఉన్నానని చెప్పి ఫోన్‌కట్ చేశాడు. ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచాఫ్ వస్తోంది. భార్య నూరే రబ్బాని హైదరాబాద్ నుంచి గొల్లపూడి వచ్చి చూడగా ఇంటికి వెళ్లగా ఇంటికి తాళం వేసి ఉంది. భర్త కనిపించలేదు. ఫోన్ స్విచాఫ్ రావడంతో బంధువులు, స్నేహితులు, చుట్టు పక్కల వారిని ఆరా తీసింది. ఆచూకీ తెలియకపోవడంతో భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆదివాసులకు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం షెడ్యూల్ ఏరియాలో స్థానిక ఆదివాసులకు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర డిమాండ్ చేశారు. అరకు ఎన్నికల సభలో సీఎం చంద్రబాబు జీవో నంబర్–3 చట్టబద్ధతపై ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని కోరారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కె.చిన్నంనాయుడు అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలో జీఓ నంబర్–3 చట్టం వలన 19 డిపార్టుమెంట్లలో 34 రకాల ఉద్యోగ నియామకాలు స్థానిక ఆదివాసులకు హక్కుగా ఉండేవని, దానిని సుప్రీంకోర్టు 2020 మార్చిలో రద్దు చేయడంతో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పిస్తామని నాడు అరకు ఎన్నికల సభలో నేటి సీఎం చంద్రబాబు ప్రకటించి ఆరు నెలలు గడిచినా జీఓ–3 చట్టబద్ధతకు అతీగతీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీతో పాటు ఆదివాసీలకు రిజర్వేషన్ చట్టబద్ధత చేసి ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రభాకర్, అప్పల నర్సయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్ పురం రైల్వే రిజర్వేషన్ కౌంటర్ మధురానగర్‌కు తరలింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికులకు సౌకర్యవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు సత్యనారాయణపురంలోని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్(పీఎస్ఆర్)కౌంటర్‌ను ఈ నెల 24 నుంచి మధురానగర్ స్టేషన్‌కు మార్చనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కొత్తగా మార్చిన మధురానగర్ స్టేషన్‌లోని పీఎస్ఆర్ కౌంటర్ నుంచి టికెట్ రిజర్వేషన్‌లు, క్యాన్సిలేషన్‌లు, అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్) టికెట్ల జారీ సేవలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఈ కౌంటర్ సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, తిరిగి 2.15 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు, ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తెరచి ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి మధురానగర్ స్టేషన్ నుంచి ఆయా సేవలు పొందాల్సిందిగా అధికారులు కోరారు.

'పందుల' సమస్యలను పరిష్కరించండి మహాప్రభో..!



జయమ్మ కంటి హాస్పటల్ వద్ద రోడ్డుపై వేసిన చెత్త వద్ద గుంపులుగా చేరిన పందులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57, 58, 59,60 డివిజన్‌లలోని సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్, భారతమాతమందిరం రోడ్డు, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో పందుల సమస్య అధికంగా ఉంది. వీటివల్ల తాము రోగాల బారిన పడుతున్నామని, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా 58వ డివిజన్‌లోని జయమ్మ కంటి హాస్పటల్ సమీపంలో, ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రధానరోడ్లపై చెత్తను పడేస్తున్నారని, దీంతో ఆ ప్రదేశాలు పందులకు ఆసరాలుగా మారి నిత్యం వాటి వద్దే సంచరిస్తున్నాయని కలత చెందుతున్నారు. వీటివల్ల తమ రోడ్లన్నీ దుర్వాసనతో, చెత్తా చెదారాలతో దర్శనమిస్తున్నాయని, చిన్నపిల్లలు వీటికి భయపడి రోడ్లపైకి కూడా వెళ్లడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఈ ప్రాంతాల్లో పెరుగుతున్న పందుల సంఖ్యలను నియంత్రించాలని, రోడ్లపై చెత్త ఉంచకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా ర్యాంపుల నిర్మాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్‌లో ఇష్టా రాజ్యంగా ర్యాంపులు నిర్మిస్తున్నారు. అధికారుల అలసత్వం, అధికార పార్టీ నేతల అండతో రోడ్డుపైకి ర్యాంపులు వస్తున్నాయి. దేవీనగర్ 8వ రోడ్డులో సచివాలయంకు కూతవేటు దూరంలో మురుగుకాలువ దాటి ఆరు అడుగుల మేర రోడ్డు వరకు ఫ్లోరింగ్ చేశారు. అలాగే రోడ్డుపైనే షెడ్డును సైతం నిర్మించారు. దీనివల్ల సువిశాలంగా ఉండే రోడ్డు కుచించుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. అలాగే దేవీనగర్ ఏడో రోడ్డు, దావు బుచ్చయ్యకాలనీ 9వ రోడ్డులో మురుగుకాలువ దాటి రోడ్డుపైకి ర్యాంపులు నిర్మించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇదేమన్నా నీ బాబుగాడి సొమ్మా అని ప్రశ్నిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురుగుకాలువలను మూసేస్తున్నారు...

రోడ్డుపైకి ర్యాంపులను నిర్మించే క్రమంలో ఇంటిముందు ఉన్న మురుగుకాలువలను సైతం మూసేస్తున్నారు. దీనివల్ల వర్షాలు కురిసినప్పుడు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. అలాగే పారిశుధ్య సిబ్బంది మురుగుకాలువలను శుభ్రం చేయటానికి సైం ర్యాంపుల వల్ల నానాయాతన పడాల్సి వస్తుంది. మురుగుకాలువలను శుభ్రం చేయకపోవటం వల్ల దోమలు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఇంటి ముందు మురుగుకాలవలపై చప్టాలు వేయటంతో శుభ్రం చేయటానికి అవస్థలు పడుతుండగా నూతన నిర్మాణాలు సైతం మురుగుకాలువలను దాటి రోడ్డు వరకు ర్యాంపులు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవటం అధికారుల బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దేవీనగర్ ఏడో రోడ్డులో మురుగుకాలువ దాటి నిర్మించిన ర్యాంపు



దేవీనగర్ 8వ రోడ్డులో మురుగుకాలువ దాటి రోడ్డు వరకు ఫ్లోరింగ్ చేస్తున్న దృశ్యం

ప్రాంగణ ఇంటర్వ్యూల్లో 18 మంది ఎంపిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద డిగ్రీ కళాశాలలో బుధవారం ముత్తూట్ ఫిన్‌కార్ప్ నిర్వహించిన ప్రాంగణ ఇంటర్వ్యూల్లో 18 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 110 మంది హాజరు కాగా, గ్రూప్ డిస్కషన్, ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూలతో పాటు, ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహించగా 18 మంది ఉద్యోగార్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి ప్రిన్సిపాల్ అనురాధ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు వెలికితీయాలి



విద్యార్థినికి జ్ఞాపికను అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు వెలికితీయాలని నగర ప్రముఖుడు డాక్టర్ ఎంసీ దాస్ అన్నారు. బెంజిసర్కిల్ వద్ద ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం రోటరీ క్లబ్ విజయవాడ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ పూర్వపు గవర్నర్ డాక్టర్ పట్టాభి రామయ్య మాట్లాడుతూ రోటరీ, రోటరాక్ట్ అనుసంధానంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని, పేరెంట్ క్లబ్ నుంచి తగిన సహకారాలు ఉంటాయని తెలియజేశారు. అనంతరం పలువురు విద్యార్థులకు జ్ఞాపికలు అందిచారు. రోటరాక్ట్ నూతన క్లబ్‌కి ఆటోమా ఆఫ్ ఆదిత్య, కారుణ్య ఆఫ్ ఆదిత్య లోగోలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎస్.సుగుణ రెడ్డి, రొటేరియన్ డాక్టర్ దేవి, చార్టర్ క్లబ్స్ ఆటోమా ప్రెసిడెంటు అభిషేక్, కారుణ్య క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ లలిత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వీర్రాజు సీడీఆర్సీ రవి, డీఆర్ఆర్ హర్షిత, డిస్ట్రిక్ట్ సెక్రటరీ సుంకర ఫణీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర వర్మ పాల్గొన్నారు.

- **అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు**

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ట్రస్ట్ వ్యవస్థాపకులు బల్లెం పూర్ణయ్య గురుస్వామి స్వామివారికి పంచామృత అభిషేకం అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.